ముదిగొండ సీతారామమ్మ



# శ్రీ సువర్చలావల్లభ మారుతీ శతకము

1. ఉ॥ శ్రీకరుడార్యుడీశ్వరుడ శేషగుణాకరుడిందు శేఖరుం
డాకమలాసనాది విధుదావళి వందితపాదయుగ్మడా
ర్యాకమనీయ చిత్తవికచాంభుజషడ్పదమూర్తివేడ్కన
స్తోక సుఖంబు గూర్చగ నుతుల్పఖచ చరించెద సంతసంబుగన్

2. ఉ॥ సిద్ధియుబుద్ధియు న్గొలువసేసలనిచ్చును మానవాళికిన్
ముద్దుగ పూజలందుకొను మోదకహస్తుడు గుజ్జురూపుడున్
ఇద్దర తుల్లల న్దనుపునీశ్వరపుత్రుడు విఘ్నహారునిన్
హద్దులు లేని శక్తిగ యంజలిచేతును విఘ్ననాయకా

3. ఉ॥ బాసర వాసినీ శుభము భాసిల చేయుము కావు నెప్పుడున్
ఆసర నీవెపల్కులకు నాశయసిద్ధికి నాత్మరక్షకున్
భాసురమైన పద్యముల భావము బాసల నాకొసంగుమా
నీ సరి యెవ్వరుందురిల నిత్యమనోజ్ఞ సువర్ణ భారతీ॥

4. చం॥ రవికులవంశవర్ధనుడు రాజిత సత్యపరాక్రముండగున్
వివశుడు కాడు కామమున విష్ణువు జిష్ణుడు మానవుండగా
అవనికి శాంతిగూర్చుటకు నంకితమయ్యెను ధర్మమూర్తియై
దివమును జేసెనీ భువిని దేవుడు రాముడు వందనీయుడై

5. ఉ॥ భావనచేతు నామదిని భావజ సంహరుడవీవెయంచునా
భావన మందు నిల్చి నిను భావన చేసెడి యోగమిమ్ము, నా
భావ భవాంధకారమును బాపుము భాగ్యమదే గడింపగా
భావమెరుంగుమా దయ సువర్చల గూడుచు దివ్యమారుతీ

6. చం॥ వరమున పుట్టెనావు వరవర్ణిని యంజని మాతకీవు, ఓ
సురవర వందితా కొనుము సొంపగునుత్పల చంపకంబులన్
మరిమరివేడుచుంటినయ మన్ననచేయుము నాదు పద్యముల్
వరమది నాదుజన్మకును భాగ్యముగా తలపోతుమారుతీ

7. ఉ॥ పావనమైన నీచరిత భావన చేసిన భాగ్యమేకదా
ఓ వనచారి రామునకు నూతమునిచ్చిన బ్రహ్మచారినా
జీవనచారి భక్తజనచిత్త విహారిసువర్చలాధరా
పావన రామభక్తి మతిపండెను గుండెల దివ్యమారుతీ

8. ఉ॥ రామ పదాంబుజంబుల విరాజిత భక్తి పరాయణుండ,ఆ
రామమెరుంగనెట్టిదయ, రమ్య సుధాకరదివ్యవర్చసా
నేమముతోడ నిన్గొలువ నిత్యము కాతువు భక్తరక్షకా
రామసువర్చలాసతిని రంజిలచేసిన దివ్యమారుతీ

9. ఉ॥ భూతములైదు నీపదము నొందగ నిల్చుట నిత్యసత్యమే
భూతహితాభిలాషివయి భోగములిత్తువు భక్తకోటికిన్
భూతములన్నినీదరిని పొందునుశాంతిని భక్తపోషకా
భూతినొసంగువాడవయ భూరిసువర్చలగూడి మారతీ

10.ఉ॥ నేరములెంచబోకు నిను నిత్యము గొల్వని దాననంచు,నా
నేరములన్ని కాల్చినను నిర్మల మానస గాను చేయవే
సారములేని జీవితము సారమునీవని తల్చుచుంటిగా
వేరుగ తల్చబోకుమయ వేగము బ్రోవర దివ్యమారుతీ

11.ఉ॥ జీవన దాతవీవు సుఖజీవిత దాతవు నీవెగావెసం
జీవని తెచ్చి లక్ష్మణుని జీవము నిల్పిన జీవదాతవే
పావని సీతజాడ కని ప్రాణము నిల్పిన భద్రమూర్తివే
కావరమున్ హరించి ననుకావుము పావన భవ్యమారుతీ8

12.చం॥ కడలినిదాటినావు దశకంఠుని లంకనుచేరినావు, నీ
వడలెడి సీతజాడెరిగి యామెకు ధైర్యము చెప్పినావుగా
సడలగచేసినావరుల శౌర్యము లంకకు నిప్పుపెట్టుచున్
బడలిన నాకు నీయుమయ బాగగుశక్తిని భవ్యమారుతీ.

13.ఉ॥ రామకథాసుధామహిమ రంజిల చేయును మానసంబులన్
రామసునామధారి వయిరాగము వీడిన భక్తశేఖరా
రామసువర్చలా సహిత రాజితశక్తి పరాయణుండ, నీ
వే మహనీయరూపుడవు వేదహితానుత భక్త మారుతీ

14.ఉ॥ కేసరి నందనా హనుమ కేల్కదలించుము సేసలీయగా
నీసరి యెవ్వరయ్యయిల నిర్మల రూపుడు దాస్యభక్తికిన్
నీసరి నీవెలోకమున, నేమమునందున, కార్యకర్తవై
చేసితి వెల్ల కార్యములు శేముషితోడను భక్తమారుతీ

15.ఉ॥ అంజనిపుత్ర ఓహనుమ ఆశ్రిత వత్సల భక్తరక్షకకా
భంజన చేసినావరుల బాసట నిల్చితినీవు దాసుడై
రంజన లేని రాముమది రంజిల చేసితి వయ్యశక్తి తో
అంజిక లేక కౌగిలిడి హాయిని గూర్చెనునీకు మారుతీ

అంజిక-సంకోచము

16. ఉ॥ తాపసియైన కశ్యపుడు ధర్మము తప్పక చేసెపూజలన్
ఆ పరమేశ్వరుండు దయ నాతని వరంబు పుత్రుడై
తాపము తీర్తునేననుచు ధైర్యము చెప్పెను తోషమందగా
రూపము మారుతంబుగను రుద్రడెపుట్టెను దివ్యమారుతీ

17. ఉ॥ ఈశునిపుత్రుగా బడియనెంతయు వేడిరి వాయువగ్నులున్
ఈశుడు తీర్చెకోర్కెనిలనెంతయు వేడ్కను రామకార్యమై
ఆశివుడే జనించె తనుదాస్యము చేయుగ రామమూర్తికిన్
ఈశుని వంటి దైవమిలనెందును కానము దివ్యమారుతీ

18. చం॥ వరమున పుట్టినావసుర భంజనచేయగ వాయుపుత్రుడై
కరమునపట్టినావు'గద'క్రౌర్యము చూపదురాత్మలందునన్
సరిసరి నీకుసాటిగల సాహసులుండిరె యీధరాతనిన్
మరిమరి వేడుచుంటినిను మంగళరూపుడ దివ్యమారుతీ

19. ఉ॥ రావణుసంహరించుటకు, రాక్షసకృత్యములాపు కోర్కెతో
తా, వరమిచ్చియున్ సతమధర్మము చేసెడిదుర్మధాంధులన్
కావరమున్తొలంగ సిరికాంతుని రాముని సేవకుండవై
పావనమంచు నీధరకు వచ్చితి నీవెగ దివ్యమారుతీ

20. ఉ॥ వాయుకుమారుడై పరగి వానరరాజుకు మంత్రివైతివే
మాయలెరింగి నట్టిమహిమాన్వితదేహుడు, మంత్రమూర్తినే
సాయమె మేలుకూర్చినది సక్యత పెంచెను వానరాళితో
కాయము కాంతివంతమగు కాపవుభక్తి దివ్యమారుతీ

21. ఉ॥ భోగివికావు నీవు గుణబుద్ధి బలంబులు కల్గవాడవే
యోగులలోన యోగివయ యుద్ధతి కల్గిన ధీరమూర్తివే
సాగెను నీదుకీర్తి దివిసత్వ సమృద్ధియు వీరమూర్తిగా
వేగెడి బాధలన్ దునిమి వేడిన భక్తుల బ్రోచుమారుతీ

22.ఉ॥ రామకథాసుమాలకును రత్నము నీవెగ రాక్షసాంతకా
నేమమునందు చెప్పుటకు నీకునుసాటిల కానమయ్య,ఏ
కామము లేదునీకు యుపకారము చేయుట నీదుతత్వమే
భామ సువర్చలపతివి భర్గుడనీవయ దివ్యమారుతీ

23.చం॥ గ్రహణము పట్టువేళ యది రాహువు పట్టగవచ్చుచుండగా
సహనమే లేక యాకలినిసాగుచుపట్టెను సూర్యబింబమున్
గ్రహమపుడల్గి యింద్రునటు రమ్మని పిల్చెను నాతడుగ్రడై
సహనమువీడి కొట్టగనె సత్యము హన్మవునైతిమారుతీ

24.చం॥ శచిపతి గొట్టగాపడితె శాద్వలమందున వాయుపుత్రుడా
అచలమువోలెదానిగని ఆతురతన్వెస వాయుదేవుడే
సుచలముమానె జీవులును శోభనువీడిరి కృంగెలోకముల్
విచలిత కంపనంబులకు వేదనకల్గెను దివ్యమారుతీ

25.ఉ॥ సుందరమైన యీభువిని సుందరమూర్తిగ పుట్టినావు,ఆ
సుందరి జాడచూడగను సుందర లంకకు చేరినావుగా
సుందరి కుందు మాపితివి సుందరకాండకు నీవె యాండగన్
సుందర రూపనీకథయె సుందర మౌనుగ ది వ్యమారుతీ

26.ఉ॥ మారుత తుల్యవేగుడవు మారుతి పుత్రుడ ఆంజనేయుడా
నేరము చేయు వారలను నీల్గగ చేయుదునీవు ధీరతన్
వీరులు నైనవారలకు వెంటను సాగుచు సాయమిత్తువే
తోరణమీవు భక్తులకు దొడ్డమనంబుగలాడ మారుతీ

27.చం॥ హనుమను తాకె వజ్రహతి యప్పటినుండియు నీవు హన్మవై
జనమన మందు నిల్చితివి జైహనుమంతుడటంచు గొల్వగన్
నినుగనసంత సింత్రుమది నీరసముల్తొలగంగమానవుల్
అనయము నినుగొల్చెదరు అంజని నందన భక్త మారుతీ

28.చం॥ పరమసుశీల నాగినియు బాధను పొందె సుశేణువల్లనే
మరమ సుమంత్రమంచను పావన మంత్రము బోధచేయగా
అరమరలేక నాగినియు అంతజపించెను మంత్రరాజమున్
బిరబిర రక్కసున్దునిమి భీతిని మాపితినీవు మారుతీ

29.చం॥ కలియుగ మందు మానవుల కామము మిక్కిలి బాధపెట్టగా
పలుకగలేక వారలును ప్రార్ధన చేసిరి నిన్ను, రామునిన్
కలతలు మాపి కాచితివి కామిత దాతవు భక్తరక్షకా
అలసటదీర్చి మాకు నిలనార్తిని బాపుము దివ్యమారుతీ

30.చం॥ సురసను నాగమాతకని సూక్ష్మశరీరిగలోని కేగి, ని
న్నర సెడిలోపె వేల్పలకు అంజలి చేయుచు వచ్చినావు నీ
సరసగుణమ్ము కాంచినను సత్వర బుద్ధి బలమ్ముకల్గగా
అరమర లేక కాచెదవె'ఆర్తి'సువర్చల గూడి మారుతీ

31.ఉ॥ వానరనారసింహహయ, వందిత గారుడ యాదివరాహరూప,ఓ
వానర శ్రేష్ఠ నీకిదియె వందన మంచును పల్కుమంటిగా
పానము చేయగా గలవు పావన నామ సుధారసమ్మునే
కానము నీకుసాటి యగు గౌరవ దైవము దివ్యమారుతీ

32.ఉ॥ నాటక రంగ మీజగతి నట్టువకాంద్రును గారె మానవుల్
మాటలు పల్కి నేర్పెదవు మన్నన కూర్తువు మట్టి బొమ్మకున్
ఆటలనాడు కొందువిట నంతముచేతువు తోచినట్లుగా
సాటెవరయ్య నీకిలను సాంబసదాశివ దివ్యమారుతీ

33.చం॥ వరమును పొందినావుమతి వైభవమున్గుణ బుద్ధి విద్యలన్
అరుదగు వీరమున్బలమునంతము లేని పరాక్రమంబులన్
కరుగవు అస్త్రశస్త్రముల కంజలి చేతువు రామశక్తికిన్
కరుణకు నీవెసాటి ఘనకాంతిని కల్గిన దివ్యమారుతీ

34.చం॥ కలియుగమందు మానవుల కష్టము దు:ఖము తీర్చునామమై
అలరగ చేయుచుందువిలనాలయముల్కల వెన్నొనిత్యమై
తొలి గురువీ వటంచు ప్రజతోషమునందు సువర్చలపతీ
మలగగ నీక ధర్మమును మన్నన చేయుము దివ్యమారుతీ

35.చం॥ గురుడయెనంశుమంతుడునుకోరిన విద్యలనేర్పి ప్రేమతో
తరుణి సువర్చలాసతిని దానముచేసెను నీకు భార్యగా
అరయగ బ్రహ్మచారివని యందురు పల్కుదురయ్య నిన్ను, తా
కరుణను సూర్యుడిచ్చె తన కాంతిని శక్తిని దివ్యమారుతీ

36.ఉ॥ వందనమోయి నీకు సురవందితపాదవి నిర్మలాత్ముడా
వందనమోయినీకు శుభవానర రూపసుగ్రీవ మంత్రికిన్
వందనమోయి క్రోధముఖ వాంఛిత దివ్యఫలంబు నీవెగా
వందిత నారసింహ ముఖ వాకొనశక్యమెనిన్ను మారుతీ

37.ఉ॥ వందనమాచరించెదవు వందిత రూపుడవయ్యనీవు,నీ
వందరిలోన చూచెదవు వాంఛిత రూపమురామచంద్రునే
సుందర తప్త కాంచన విశోభితరూప సువర్చలాపతీ
ముందర నిల్చిమమ్ములను ముందుకు నెట్టుము దివ్యమారుతీ

38.ఉ॥ దివ్యసువర్చలాసతికి దీధితినీవు సువాలమూర్తివై
భవ్యభవాని వాలమున బంధన చేసిన యోగమూర్తివై
అవ్యయమైన శక్తికిని‘ఆలయ’మౌదువు మర్కటేశ్వరా
సవ్యము నీదు సేవనము సాధన నీయవె దివ్యమారుతీ

39.ఉ॥ ధాతువు నీవు భావికిని,దాడితపేడి తమానవాళికిన్
త్రాతవు,నమ్ము వారలకు తాలిమి ధైర్యము కల్గచేయుమా
నేతవురామపాదముల నిత్యము నమ్మిన దూతవేదువౌ
మాత సువర్చలాసతికి మన్నన గూర్చిన దివ్యమారుతీ

40. ఉ॥ పార్థురథంబుపై నిలిచి పావన గీతను వింటినీవు,మా
ప్రార్ధన నాలకించి పరమార్థము చూపుము నీ దిక్కువై
అర్థులచేయబోకుము పరార్థము కోరసువర్చలాపతీ
అర్థము నీవెదేవశివ'ఆశ్రిత' వత్సల దివ్యమారుతీ

41. ఉ॥ గీతము పాడలేను రసగీతము వ్రాయగనెంతుగాని,సం
గీతము నాకురాదు పదకీర్తనెగాని సువర్చలేశనా
గీతము నాలకించి మదికింపగురాగము నేర్పవయ్య, యే
రీతిగ భావరాగముల రేఖను చూపెదొభవ్యమారుతీ

42. ఉ॥ రేపును గూర్చి యోచనను రేపును మాపును గడ్చిపోయి, మా
దాపున నున్న మృత్యువును దాటగ శక్యమొ యిష్టమట్లుగా
వాపును చూచుచున్బలుపు భావననుంటిమి మందభాగ్యమే
కాపువు నీవు నాకు సహకారము చేయవె దివ్యమారుతీ

43. ఉ॥ పుట్టిననాటినుండియిటు పొట్టకు బట్టకు దేవులాడునే
నెట్టులనిన్ను గొల్తునికనేవిధి మానసముందు నిల్కడన్
తెట్టువగట్టు కోరికలు తీరుగనుండవదేమి సేతు, నే
నెట్టుల నిన్నుచేరగల నీశ్వరకావుము దివ్యమారుతీ

44. ఉ॥ రామసువర్చలా సతిని రంజిలచేసిన వానరేశ్వరా
కామమువీడనన్నిలను కావటెసన్నుత కీర్తిమంతుడా
నేమముతోడకీల్చెదనునిత్యమునీవిల వెంటనుండుమా
ఓ మహనీయరూపయిల నూర్జిత పాపమడంగ మారుతీ

45. చం॥ బలమును బుద్ధి తేజమును భవ్యయశస్సును ధైర్యమున్నదా
కలుగగ జేతువీనీవనుచు గౌరవమందిన రామబంటువే
తొలగగచేయుమాభయము, తోషమునింపుము నీవరోగతన్
కలుగగచేయు దైవమవు కాంచనరూపుడ దివ్యమారుతీ

46.ఉ॥ వానరసేన నాయకుడ వారధి కట్టితినీవు, సీతకై
మానుష కార్యమే యిదియుమంచిని చేయగదేవతాళికిన్
మానవురాము సేవకయి మారుతి విట్టుల మర్కటంబుగా
దానవసేన గూల్చితివి దైవము నీయవ దివ్యమారుతీ

47.చం॥ వెతలను బాపుమయ్య వెయివేల వరంబులు కోరనయ్య యీ
మతకరి లోకమందునను మంత్రివినీవయి సాయమీయవే
అతుల మహానుభావుడ దయామతి జూడుము రామభక్తనే
సతతము నిన్నె కొల్చెదను సామిరపుత్రుడ దివ్యమారుతీ

48.ఉ॥ అల్లరి గాంచిశాపమిడె ఆమునులెల్లరు క్రోధభావనన్
మెల్లగ మర్చిపోవగను మేలగునీదగు శక్తులన్నియున్
చల్లని మానసంబునను సాగితివన్నిటముందు ముందుకున్
ఎల్లరు తోషమందగను నెంతటి నేర్పరి నీవు మారుతీ

49.ఉ॥ రాముని మెప్పు పొందితివి లంకను సీతమజాడ తెల్పగన్
ఆమని చూపినావుగద ఆయమసీతకు రామబంటువై
నేమముగాంచి నిన్నిలను నిత్యుని చేసెను కార్యదీక్షయే
ఓమహనీయరూపదయనున్నతి జూపుము దివ్యమారుతీ

50.ఉ॥ దేవతలందరొక్కటయి దీనముగామిము వేడుకొంటచే
ఆవగదీర్పనందరుననంశల నిచ్చిరి వానరాళికిన్
ఈవనచారులై హరికినెంతయుసాయము చేసినారు, మీ
జీవిత మున్నెరుంగుటయె జీవన మిచ్చుగ దివ్యమారుతీ

51.చం॥ దయగలవాడ నీవు ధరధర్మమెరింగినవాడనీవెగా
నయమున శాస్త్రభావములనైక్యతెరింగినవాడవీవుగా
రయమున కాచువాడవును లంకను కాల్చినవాడవీవె,నా
భయమును తీర్చినాకెపుడు బాసటనిల్వుము భవ్యమారుతీ

52.ఉ॥ వ్యక్తి వికాశమెట్టిదన భాషణమందున కానుపించుగా
యుక్తిని చూపినావుసమయోచితభాషణమందుమాకు
రక్తియగున్ కదా సతము రామకథాశ్రవణంబునీకిలన్
ముక్తిని గూర్చగా గలవు మోదము తోడను దివ్యమారుతీ

53.చం॥ గురువుగనెంచి యారవికోరితివిద్యలు నేర్పుమంచు,నే
తిరిగెడివాడ నీ జగతి తీరుగ నేర్పగ నెట్లువచ్చునన్
తిరిగెదనేను కూడనని తీరుగ నేర్చితినీవు భక్తితో
గురియిదియంచు తెల్పితివి గూఢపు శాస్త్రముదివ్యమారుతీ

54.ఉ॥ నాయకుడన్నయెవ్వరగు నమ్మకమిచ్చిన వాడుకాదె, ఈ
నాయకధర్మమే సతము నాయకుచేసేను వానరాళికిన్
సాయకమైబెలంగితివి సాహసబుద్ధిని లంకకూల్చగన్
మాయమునుంగుమానవుల మత్తును మాపుము దివ్యమారుతి

55.ఉ॥ స్వామివి నీవు నేననగ సౌమ్యమునొక్కటె యాత్మభావనన్
స్వామివినీవుయీా జగతి సాగితి నేనొకబంటు నేదుగా
స్వామివి యీభువిప్రజకు వాంఛలు తీర్చగపాలనంబుచే
ఏమియెరుంగగాగలను ఈశ్వరతత్వమిదేను మారుతీ

56.ఉ॥ మార్గశిరంబునందునరమాధవుగొల్చుట తప్పుగాదు,ఆ
మార్గశిరంబు నందురమాధవుతోడను నిన్ను గొల్చుటలో
మార్గము దివ్యలోకములు మన్నన చేయుటకౌను తప్పదే
మార్గము మంచిదే సుగమమార్గముచూపును దివ్యమారుతీ

57.చం॥ అడవుల తిర్గురాముగని ఆప్తసుహృత్తుగచేరి వెంటనే
అడలెడి కారణం బరసి యా రవి పుత్రుని చెల్మి కూర్చివే
సడలిన ధైర్యమున్నిలిపి సాగగచేసితి నీవు లంకకున్
కడలిని దాట చేసితివి కాంచనరూపుడ దివ్యమారుతి

58.ఉ॥ కన్నులజారబాష్పములు కాంతువెయర్ధనిమీతంబుగా
చెన్నగు సీతరాములెదచేతమునిండుగు భక్తి భావనన్
ఉన్నది రాముడొక్కడను నూహనునుందువు ధర్మనిష్ఠతో
విన్నది గాదు నీ మహిమ వేడుక కంటిమి దివ్యమారుతీ

59.ఉ॥ భానుసువర్చలాసహిత భాసుర దివ్యపదారవింద, శ్రీ
రామునిదాస రమ్యగుణరాజిత భవ్యపరాక్రమార్య, ఏ
నేమము నిన్ను భక్తునిగ నిల్పెనొదానిని మాకొసంగు,మా
రాములు చేయకింకననురాపిడి పెట్టకు భక్తమారుతీ

60.చం॥ కనకపు కొండవంటి తనుకాంతిని కల్గినవాడ, దాసుడే
ఇనకులరామ చంద్రునకు, నెన్నగ నామసుధారసమ్ములన్
ఆనయము గ్రోలువాడితడు ఐక్యమునందును భక్తిభావనన్
వినయము శక్తి శౌర్యములు వింతగ చేరెను నిన్ను మారుతీ

61.ఉ॥ మోహము సర్వదు:ఖములమూలమటంచును పల్కుచుందురే
మోహము జీవకోటికిని ముక్తిని గూర్చునెరుంగు సత్యమున్
మోహము దైవమందిడిన మోక్షము కల్గును దైవసాక్షిగా
దేహమునందు చూపునెడ దేవుడు మెచ్చదుగాదె మారుతీ

62.ఉ॥ అర్ధమెజీవితాన పరమార్ధమటంచును తిర్గుచుండు, ఏ
అర్ధము వెంటరాదనెడి అర్ధమెరుంగడు మానవుండిలన్
స్వార్ధముతోడ జీవనము సారము లేకయె యెల్లకాలమున్
వ్యర్ధముగాగనేడ్చెదరు అర్ధము చేయవె దివ్యమారుతీ

63.ఉ॥ కామముమిన్ను ముట్టినది కాంచగలోకమునందు మిక్కిలిన్
ఏమరుకుండ తీరగనునెన్నియో పాట్లను పొందుచుండె, ఏ
సామమెరుంగ కుండిరిలసాగునె జీవితకాలమంతని
ష్కామమునేర్వగావలయు కార్యము నీదయ దివ్యమారుతీ

64.ఉ॥ ఏమి పరాకునాపైన నెట్టుల వ్రాతునువందపద్యముల్
స్వామివి నీవుగా వెమరి సాయము సేయవె,ఆర్తరక్షకా
కామనలేమి లేవుదయకావుమునన్నిలదీనబాంధవా
ఏమని కోరుదాన, నిను నీశ్వర యంతటనీవెమారుతీ

65.ఉ॥ దాసుండవీవు రామునకు దాసప్రియుండవు భక్తికల్గినన్
దాసులదాసుడై ప్రజకు దాస్యము చేసెదనీవు, ఏమినీ
దాసపరత్వబుద్ధి భువిదాసుడనంగను నీకెచెల్లు, ఓ
దాసవిధేయ దాసిగను దగ్గర చేర్చుము దివ్యమారుతీ

66.ఉ॥ చక్కని వాసనల్కలుగుచంపకమాలలు నీకునీయగా
చక్కనిమార్గమిమ్ము గతజన్మల పాపములన్వరాంపగా
మక్కువమీరగైకొనుము మాన్యత గల్గను మంత్రమూర్తిన
న్నక్కున చేర్చుకొమ్ముదయనంజని పుత్రుడ దివ్యమారుతీ

67.చం॥ హరికిని సేవకుండవయి ఆహరుపూజన తత్పరుండవై
పరులని తల్చబోకుమను పావనసత్యము చెప్పినావు, ఓ
హరిహరరూప నీవెయిల నాత్మను నిల్పిన సత్యరూపివో
సురవరవందితా హనుమ శోధనచేయకు దివ్యమారుతీ

68.చం॥ విజయుని కోర్కెతీర్చగను వేడుక తోడసుకేతనమ్మువై
విజయమునీయగా నిలిచి వేదన తీర్చితివయ్య సామివే
సుజనమనోభిరాముడవు శోభనమూర్తి విరామభక్త, ఆ
అజహరి ఈశరూపుడవు అంజనినందన దివ్యమారుతీ

69.చం॥ శివునికి పూజసల్పును విశేషముగా యవనాశ్వుడెప్పుడున్
అవని ప్రసాద సేవనము నట్టుల చేయడు గర్వభావనన్
అవినయ భావమున్గనిన నాభవుడెంతయు పాపమీయగన్
పవన కుమార నీకృపను పాపముదాటెనతండు మారుతీ

70.చం॥ ఇరువదియేడు నామములు ఈహనుమానుని దివ్యనామముల్
వరదుటంచు తల్చుచును ప్రార్ధన చేసిన సంతసించి తా

వరకరుణారసంబులను వర్షము భంగిని జల్లుగాదె, ఆ
సురుచిర సుందరాకృతి సుశోభితమూర్తివి దివ్యమారుతీ

71.చం॥ అనయము పూజసల్పినను యాకలిదప్పులబాధ దూరమౌ
ఘనుడు'సుదంతు'వేతనను కాంచిన మౌనిమె బాధతీరగన్
ననువగు మంత్రమిచ్చెకొను మంచును పల్కెనుదారచిత్తుడై
వినయముతో జపించగను వేదన తీర్చితివయ్యమారుతీ

72.ఉ॥ వేదసరస్వతీ దరిని వేడుకనుండెడి దివ్యరూప, ఆ
వేదవిహారులే మెరుగు వేదన పొందిరి, నీదుతత్వమే
వేదముగాదె, ఈజగతి, వేదనతీర్చగవచ్చినావు, ఓ
సాధనశీలి కాంచుమయచల్లగ భక్తుల దావ్యమారుతీ

73.చం॥ కలియుగమందు మానవులు కాంచరు మంచిని శాస్త్ర ధర్మమున్
అలసులు దీర్ఘరోగులుగ నార్తిని దు:ఖము పొందుచుండెగా
కలసిన మానసంబులను కానము కుళ్ళుకుతంత్రభావనల్
కలిగిన వారికీయవె సుకామన బుద్ధిని దివ్యమారుతీ

74.ఉ॥ భీకరయుద్ధమందునను ప్రీతిగ పోరెడి సోమదత్తుకున్
చేకురెగా పరాజయముచింతిత మానసుడయ్యె, కానకున్
పోకను తప్పలేదు తన పుణ్యవంశంబున నీదు మంత్రమే
సాకెను దివ్యరూపమున సామిరపుత్రుడ దివ్యమారుతీ

75.ఉ॥ పావని మంత్రరాజములు పావనమౌగదమెల్ల వారికిన్
ఏవగపైనమాన్ని యిల యిచ్చును సంపద, యండదండగా
కావగనిల్చుగాసతము కాపలో భక్తికి దాసదాసుడై
పావకు భంగికాల్చునుగ పాపములన్నియు దాసమారుతీ

76.ఉ॥ రాముని నామగానమున రంజిలి నిల్చును భాష్పనేత్రుడై
ఆ మహనీయమూర్తికిని అంజలి చేసిన జన్మధన్యమౌ
పావని పావనుండెజన ప్రార్ధనెప్పుడు నాలకించు, నే
కామననైన తీర్చగల కామిత సిద్ధుడె దివ్యమారుతీ

77.చం॥ ఇరువది యేడు నామముల నెవ్వరు కీర్తన చేయుచుందురో
కరుణను వారి కాచెదవు కాంక్షలు తీర్చుచుకామకోటివై
మరువవురామనామమును మాన్యచరిత్రుడ, సామిభక్తినిన్
మరువవు సాయమైనిలిచి మన్నన గూర్తువు దివ్యమారుతీ

78.ఉ॥ నామమెదివ్యమంత్రమగు తత్పర బుద్ధి జపించువారికిన్
నామము సర్వరోగహర తారక మౌనుగ మానవాళికిన్
కామనలన్ని తీర్చగల కార్ముక మౌనుగ, అన్ని వేళలన్
నామము వీడకుండినను నిత్యత కల్గును దివ్యమారుతీ

79.ఉ॥ నమ్మితి దివ్యపాదములు నమ్మితి నమ్మితి నీదు నామమే
నమ్మిక వమ్ము చేయకుమునమ్మినవారలమాయచేతువే
అమ్మకచెల్ల! నిన్నుప్రజలాశ్రిత వత్సలుడంట సత్యమా
లెమ్మని సాయమీయవయ లీలగమాకును దివ్యమారుతీ

80.చం॥ అభయము నిచ్చినావుగ యయాతికితల్లియె చెప్పెనంచు, మీ
ఉభయులు దేవ,భక్తులును యుద్ధముచేసిరి ఘోరమౌనటుల్
విభవము పెంచినావుగద పావనమంచును రామనామమే
శుభమయె కార్యకారణ విశోభిత మూర్తిని దివ్యమారుతీ

81.ఉ॥ మిత్రుని మిత్రుడై జగతి మిత్రుని పుత్రుని మిత్రుడైతివే
మిత్రతలోని విశిష్టతనుమేలును తెల్పితి వయ్యసామి, ఆ
మిత్ర వివేకశక్తులను మిత్రుకూర్చెను మిత్రబంధువా
మైత్రికి సాక్షినీవనుచు మాన్యులు పల్కిరి దివ్యమారుతీ

82.ఉ॥ వందన మోయినీకు సువర్చల మానస దివ్యరూపుడా
వందన మంచు పల్కెదను బంధనఛేదన భక్తపోషకా
వందనమోయి నీకు శుభవాంచిత బుద్ధి ప్రదాత సుందరా
వందిత పాదయుగ్మవర వానర ముఖ్యుడ దివ్యమారుతీ

83.చం॥ వ్యథలను రూపుమాపెదవు వాయుకుమార సుధామయంబుగా
కథలను చెప్పుకొందురయ కాంచన శైలసరూపదేహుడా
సుధమగురామకావ్యమున సొంపును కూర్చెడి మానికంబువే
వ్యధను తొలంగ చేసినను వర్ధిలచేయుము దివ్యమారుతీ

84.ఉ॥ హారికి భక్త మానస విహారికి గర్వితదుష్ట దైత్యసం
హారికి సాధుజీవనవిహారికి సంతతరామనామసం
చారికి ధర్మ సంహిత విచారికి రామసువర్చమనో
హారికి  వందనంబులివె ఆత్మవిచారికి దివ్యమారుతీ

85.ఉ॥ శ్రీవయిశాఖ మాసమున శ్రీకరమౌదశమీతిథిన్మమున్
కావగపుట్టె పూర్వభద్రమున కాంచనరూపము తోడ నీశుడే
పావన మందవాసరము పావనమయ్యెను నాటినుండియే
పావని పూజనంబునను పాపము పాయును దివ్యమారుతీ

86.ఉ॥ భూతములైదునీదరిని బుద్ధిగనుండును యెల్లవేళలన్
భూతపతీవెయందురమ భోగమురోరని భవ్యరూప, ఓ
భూతహితాభిలాషి పరిపోషణ చేయుము భాగ్యదాత, ఓ
పూత చరిత్ర కావుమిల పొందగతోషము దివ్యమారుతీ

87.ఉ॥ వ్రాయగ నెంచినాను వరవానర నాయకు ఆంజనేయుపై
వ్రాయగచేసి పద్యముల వ్రాసిన తేజమునందచేసినే
వ్రాయునదంత దివ్యమని రంజిలచేసి సువర్చలాపతీ
వ్రాయగ నామదిన్నిలిచి వర్ధిల చేయవే దివ్యమారుతీ

88.చం॥ తెలిసితినంచు గర్వమున తీరునెరుంగని వార్కికల్గనే
తెలియగచేసి వారలకు తేరును గూర్చుము దీనబాంధవా
కలియుగ మందు నామజపకారణ మిచ్చును సర్వసౌఖ్యములో
మలగని పుణ్యమందులకు మానిత వైఖరిదేను మారుతీ

89.ఉ॥ వత్సరమాయె దుర్ముఖయె వాంఛలు పెక్కులు, నీచబుద్ధులే
మత్సరభావజాలములు మానసమంతయు నిండిపోవగా
కుత్సితలోకమందునను కోరిన జీవితమెట్టులుండు,నీ
వత్సల బుద్ధి చూపుము సువర్చల గూడిన దివ్యమారుతీ

90.ఉ॥ ఏ శనివారమైన పరమేశుడటంచును పూజసల్పినన్
ఏ శని బాధలంటవు కపీశ్వరునానతి, రాగమల్లికల్
నాశన మందునంట జననాల్కల నీదగుదివ్యనామమే
ఆశలదీర్చగా గలదు అంజని నందన దివ్యమారుతీ

91.చం॥ జగమొక యింద్రజాలమని చక్కగ నెర్గిన వాడు యోగియై
సుగుణము నిర్గుణంబుగను సాగెడి వాడగు నీశుగాంచుగా
అగణితమైన సంపదలు హాయిని గూర్చవటన్న యెర్కతో
జగమును మర్చి తాపసిగ సాగును నీదయ దివ్యమారుతీ

92.ఉ॥ మాయయెకప్పి యున్నదను మాటనెరుంగక మూఢచిత్తులై
పాయరు పుత్రపుత్రికలు నెన్నడు నన్నను భ్రాంతి చిత్తుడై
ఆయమకూపమందుపడినట్టిటులాడక కృంగిపోవగా
మాయమునంగనీకుముమాకిల దిక్కువు భవ్యమారుతీ

93.ఉ॥ ఆశగనెంచబోకుము దురాశగనెంచకు నాదుచేత, పే
రాశగ చూడబోకుము నిరాశను చేయకు జీవితమ్మునన్
ఆశకునాశ పుట్టినది అంజని సూనుడ నిన్ను తల్చగన్
ఆశనుదీర్చవేదయను అంజలి చేతును దివ్యమారుతీ

94.ఉ॥ ఎట్టుల వ్రాతునేనసుచు నెంతయు కృంగితి నీశతమ్మునే
పట్టిన పట్టుతోడ ననుపట్టితి నీవె సువర్చలాపతీ
ఇట్టిది నీదయాగుణముదెవ్వరి యందుననైన చూతుమే
గట్టిగ వ్రాయచేసితివి కాంచగ నీవగు దివ్యమారుతీ

95.ఉ॥ కానగనైతినీకరుణ కానగనైతిని ప్రేమబంధముల్
కానగనైతి సద్గురుల కానగనైతి సుభాషితంబులన్
కానగనైతి విద్యలను కానగనైతిని మిత్రబంధులన్
కానగనైతి యీభువిని కానగ చేయవే దివ్యమారుతీ

96.ఉ॥ మోదకఖాధినీవనగ మోదము కల్గెను నాకు నెంతయో
నీదయకోరి మానవులు యిత్తురుగా వడలప్పముల్సదా
సాదరభావము న్గొనుచు సంపద విత్తువు భక్తకోటికిన్
మాదగు మానసంబుగొని మన్నన గూర్చవే దివ్యమారుతీ

97.చం॥ కనకపు కొండవంటి తను కాంతిని కల్గినవాడుదాసుడే
ఇనకులరామచంద్రనకునెన్నగ నామసుధారసంబులన్
అనయముగ్రోలు వాడితడు ఐక్యతనందును భక్తి భావనన్
వినయము శక్తిశౌర్యములు వింతగ కొల్చును నిన్నుమారుతీ

98.ఉ॥ మాపునురేపు నీ జపము మానకచేసెడి భాగ్యమిమ్ము, మా
దాపుననిల్చి కష్టములదాటగచేసెడి యోగమిమ్ము, నీ
ప్రాపునుకోరినాముసుర వందిత నీ దయ సాగనిమ్ము మా
పాపమురావిపోవగను పావన రూపుగ దివ్య మారుతీ.

99.చం॥ గుండుకులోద్భవుండు గుణకోవిదుడానరసింహశాస్త్రి తాన్
మెండుగు భక్తితోడ పెనుమేగలితోడుత కట్టెనాలయం
బండగ నుందువంచు యిల పావనమూర్తివటంచుతల్చుచున్
దండిగబ్రోచు ధర్మమును ధైర్యముగూర్చెడి దివ్యమారుతీ
మేగలి= పూనిక

100.చం॥ అతనిది గుండువంశమగు నాతని పుత్రిక నాగమాంబకున్
సుతుడొకడుండెనాతనిది చూడగ గబ్బిట వంశమౌను, తా
తతని పెంచి ధర్మములనన్నియు నేర్పెను పెండ్లిచేసెగా

అతడయె ధర్మకర్త గుడికాతనిపాలనసాగె మారుతీ,

101. చం॥ అతనికి పుత్రపుత్రికలు నైదుగురుండిరి సత్యనిష్టులై
సతతము ధర్మరక్షణగ సాగుచునుండిరి వారలందరున్
నతుండు రామభక్తునిగ అంజనిచేయుచుసేవ చేసెడిన్
మతిని, నిబద్ధమానసులు భక్తులు నీకును దివ్యమారుతీ

102. ఉ॥ గేహమశాశ్వతమ్ముతగ తీరుగ కార్యములెన్ని చేసినన్
దేహికి కీర్తి కల్లదని దేవళమందున పూజ సల్పుచున్
సాహితి సేవయున్ జరుపు సాహసి దుర్గప్రసాదు డిచ్చుటన్
మోహమెరుంగకన్సతము మోదము తోడను దివ్యమారుతీ

103. ఉ॥ ఊరన నూరుగాదిచట నోర్చున నుందురు నందరొకటు
య్యూరున స్వామికార్యమున నుందురుముందర, ఆలయంబునన్
వారల స్నేహ సఖ్యతల వారిత తాండవమాడు చుండగన్
వీరులసాటి యెవ్వరని వేడక చూతుము దివ్యమారుతీ

104. ఉ॥ గబ్బిటవారి పూజకు కాపుగనిల్చెను ఆంజనేయుడే
దబ్బరకాదు సత్యమిదిదాసుడు రాముని దాసదాసుడై
అబ్బురమైన గ్రంథములనన్నియు వ్రాయగశక్తియుక్తులన్
నిబ్బరమున్, సుకార్యములు నిత్యము చేయగ దివ్యమారుతీ

105. చం॥ వరముదిగొండ వంశజుడు పన్నుగ పన్నగ మల్లికార్జుడున్
గిరిశ పదారవిందయుగకీర్తితభక్తి పరాయణుండు నై
వరపతినాకు నాతడయి వర్ధితె, ఈశునిచేరెనె ప్డొ, త
ద్వారమున వ్రాయగల్గితిని పద్యమునిట్టుల భవ్య మారుతీ

106. ఉ॥ ఇత్తువు సర్వసంపదల నిత్తువు విద్యలు కోర్కెతీరగా
ఇత్తువు సర్వసౌఖ్యములు యిత్తువు మాకు నరోగ జీవికన్
ఇత్తువు అష్టసిద్ధులను నిత్తువు మోక్షము జీవకోటికన్

ఇత్తువుగాశుభాలనిల ఇత్తువు సర్వము దివ్యమారుతీ

107. ఉ॥ మంగళరూప ఓ హనుమ మంగళదాయక రామదాస
మంగళ మౌకరంబునను మంగళ మంచును సేసలీయుమా
మంగళ మౌను, యీ శతక మందరుమెత్తురు మంగళంబుగా
అంగన ఆ సువర్చనకు నంజలి, అంజలి నీకు మారుతీ

# వంశ చరిత్ర

సీ॥ గుండుకులాబ్ధికి గొప్ప గౌరవముండె
ఉయ్యూరు వాసులై యుండువారు
నారసింహావథా ననసద్గుణంబుల
దిట్ట, శాస్త్రచయము తీరు నెరిగె
ధర్మార్థ కామాలు తనయులుగా పుట్టె
తనియచేసిరివారు ధర్మమునకు
పుత్రసంతు కొరకు పూజలు చేసిరి
గుడి కట్టె హనుమకు కోర్కె తీర

తే॥గీ॥ వచ్చుగబ్బిట వారలు వాంఛ తీర్చు
ననుచు చెప్పెనో ఏమొ, యీ ఆశ తీర
జననమందెనుగ, మృత్యుంజయుడునంత
తండ్రికోల్పోయి తాతకు దగ్గరయ్యె.

సీ॥ గబ్బిట వంశాబ్ది ఘనుడు దుర్గాపతి
అగ్రహారీకుండు అమలగణుడు
గుండువారల ముద్దు గుమ్మ నాగమ్మను
పెండ్లాడిపొందెను బిడ్డనొకని
పుణ్యకర్మవశాన పొందెను స్వర్గమ్ము
చిన్నతనమునందె చింత మిగుల
కొడుకుతో నాగమ్మ కూర్మిపితను చేరె
బ్రతుకు భారమనుచు బాధతోడ

తే॥గీ॥ వారు యుయ్యూరు వాసులై వరలినారు
తాత వద్దను పెరుగుచు ధర్మమరసె
అతడు మృత్యుంజయుండగు అమృతమూర్తి
ముద్దుముద్దుగ పెంచిరి ముదము గూర్చ

తే.గీ॥ మనసుతోడపెంచెను మాతామహుడు, వీరు
నేర్చె శాస్త్రాలు ధర్మాలు నియతితోడ
గుండువారి భవానియన్ కోమలాంగి
పెండ్లియాడి సఖించెను ప్రేమపంచి

తెలుగు అజ్జగా కీర్తిని తేజమంది
వెలిగె విద్యార్థిలోకాన విలువతోడ
కృష్ణాజిల్లాను వీడని కీర్తికరుడు
ఇతడు వుద్యోగవిరమణ మిచటజరిగే.

కం॥ మృత్యుంజయశాస్త్రి గుణుడు
సత్యముతో జీవితంబు సాగించంగా
నిత్యులు ముగ్గురుపుత్రులు
అత్యంతము ప్రీతిగొల్పననవరతమ్మున్

సీ॥ నరసింహశర్మయు వరరామనాథుండు
దుర్గాప్రసాదుండు దురిత హరుడు
కలిగె కుమారులు కలరు కూతుళ్లను
దుర్గలో పాముదత్రోషమీయ
తెలుగు ఒజ్జగా దివ్యమౌతేజమండి
విద్యార్థిలోకాన విదితయశుడు
వివిధ గ్రామాలలో విద్యాగరపి గర్వి
చేరె నుయ్యూరుకు చేతములర
బిడ్డలును పుత్రవంతులై ప్రేమపంచ
వాయుపుత్రుని సేవలో వంతదీరి
గడిపె జీవితమ్మును తుది కలతలేక
తాను దివికేగి బ్రతుకున ధన్యమయ్యే.



# కవయిత్రి పరిచయం

| | |
|---|---|
| పేరు : | ముదిగొండ సీతారామమ్మ |
| జననం : | 26-7-1949, మచిలీపట్నం |
| తల్లిదండ్రులు : | నిడుమోలుకామేశ్వరమ్మ, శ్రీరామమూర్తి |
| విద్యావివరాలు : | S.S.L.C మున్సిపల్ గరల్స్ హైస్కూల్ M.T.M భాషాప్రవీణ శ్రీ నారసింహ సంస్కృత కళాశాల చిట్టిగూడూరు. కొలచెల వెంకటకృష్ణమూర్తి సంస్కృత కళాశాల గుంటూరు. M.A తెలుగు నాగార్జున యూనివర్సిటి. |
| భర్త : | మధురకవి ముదిగొండ నాగ మల్లికార్జునరావు M.A(Lt) తెలుగు పండిట్ |
| సంతానం : | 1. ముదిగొండ తేజశ్వి - కిరణ్మయి |
| మనుమడు: | నాగమల్లికార్జునశివాత్మకి, మనమరాలు : శ్రీచిన్మయి |
| | 2. ముదిగొండ ఫణిధూర్జటి |
| కుమార్తె : | పూర్ణబాల కాత్యాయని శివలెంక నాగచంద్రశేఖరు |
| మనుమరాండ్రు : | శివమౌక్తిక, శివజ్యోత్స్నిక |
| సాహితీ ప్రస్థానం : | సాహితీ మిత్రులు మచిలీపట్నంలో 10సం॥ కార్యవర్గసభ్యులుగా, 10సం॥ నుండి కోశాధికారిగా వుంటున్నారు. అష్టావధానం, చతుర్గణిత అష్టావధానం, శత,ద్విశత, పంచ సహస్రావధానులు లోను, గణిత, గీతా, అలంకార అవధానులలో పృచ్ఛకురాలిగా పాల్గొనుట. |
| పురస్కారాలు : | ఆంధ్ర సారస్వత సమితి ఉగాదికి నిర్వహించిన కవితల పోటీలో విశిష్ట కవితాపురస్కారం. మినీ కవితల పోటీల్లో ద్వితీయ బహుమతి |
| రచనలు : | మల్లికార్జున శతకము<br>తెలుసుకొనరనీతి తెలుగువాడ (శతకం) ముద్రితం<br>మానస శతకము<br>నవయుగాల బాట నారి దిపుడు (శతకం)<br>శ్రీ సువర్చలావల్లభ మారతీ శతకము<br>పొడుపు కథలు (పద్యాలలో) ప్రమిదలో ప్రచురితం<br>తిరుప్పావై (సీసపద్యాలలో) విజ్ఞానసుధ, ప్రమిదలలో<br>తిరువెంబావై (సీసపద్యాలలో) పుస్తక సమీక్షలు. |









































శ్రీ సువర్చలాంజనేయస్వామి దేవస్థాన ధర్మకర్తలు
శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్, శ్రీమతి ప్రభావతి దంపతులు